క్లుప్తంగా

స్విమ్మింగ్‌లో కైకరం విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న హెచ్‌ఎం ప్రసాదరావు, ఎంఈవో శ్రీనివాసరావు

ఉంగుటూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో డిస్ట్రిక్టు స్పోర్ట్సు అథారిటీ ఏలూరులో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో స్విమ్మింగు విభాగం అండర్‌–17లో కైకరం హైస్కూలు విద్యార్థులు విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాగోలు లక్ష్మీ, శ్రీచైతన్యకుమార్, బ్యాక్ స్ట్రోక్ కేటగిరిలో రాగోలు భద్రత్‌ప్రథమస్థానం, కనమటి రాకేష్ ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. విద్యార్థులను, శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జి.నాగసుధ, పాపాయమ్మను ఎంఈవో కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులను అభినందించారు.

డీఐజీని కలిసిన సీఐ శ్రీనివాస్



ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌ను కలిసిన పెదవేగి సీఐ కే శ్రీనివాస్

దెందులూరు: పెదవేగి సీఐ కే శ్రీనివాస్ శుక్రవారం ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల అమలుకు శాఖాపరమైన నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని డీఐజీ సూచించారు. పాలకొల్లు సీఐగా కే శ్రీనివాస్ పనిచేస్తూ పెదవేగి సీఐగా బదిలీపై వచ్చారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలోని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కెఎల్‌వి పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తులను స్వయంగా స్థానిక కొత్తబస్టాండ్ హీరో షోరూమ్ దగ్గరలోని జిల్లా బాలల సంరక్షణ యూనిట్ కార్యాలయం నందు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అందించాలన్నారు. అర్హులను జిల్లా సెలెక్షన్ కమిటీ/జిల్లా టాస్క్‌ఫోర్సు కమిటీ ఆహ్వానిస్తుందని తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్.08812–249883 సంప్రదించాలన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం శ్రీ చక్ర సహిత ముత్యాలమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ పద్మ కుమారి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు మిత్తిపాటి విశ్వనాథ శ్రీనివాస్‌శర్మ అమ్మవారి ఉత్సవ విగ్రహానికి, అనంతేశ్వర స్వామికి పంచామృత ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పితానికి సూర్యప్రకాష్‌రావు, యర్రా నాగేశ్వరావు సత్య దంపతులు, ఏడుకొండల స్వామి, చోడవరపు రంగరావు జ్యోతి దంపతులు, దువ్వ రామకృష్ణ దంపతులు దర్శించుకున్నారు.

తాత్కాలిక సీనియారిటీ జాబితా విడుదల

బుట్టాయగూడెం: ఐటీడీఏ కేఆర్‌పురం పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియారిటీ జాబితాను విడుదల చేసినట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి డీడీ పీవీఎస్ నాయుడు శుక్రవారం తెలిపారు. ఈ తాత్కాలిక సీనియారిటీ జాబితాను సహాయ గిరిజన సంక్షేమాధికారి కార్యాలయ నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ జాబితాను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచామని అన్నారు. గిరిజన ఉపాధ్యాయ సంఘ నాయకులు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది తాత్కాలిక సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 7వ తేదీ లోపు తెలియజేయాలని అన్నారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది సీనియారిటీ జాబితాను ప్రకటిస్తామని అన్నారు. వాటి ఆధారంగా పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

నూకాలమ్మ ఆలయానికి వెండి సమర్పణ

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ వారు శుక్రవారం విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ సుమారు 25 కేజీల వెండితో అమ్మవారికి రజత వస్త్రం తయారు చేయించేందుకు సంకల్పించామన్నారు. శుక్రవారం మరడాని మహేష్ వరలక్ష్మి దంపతులు 9తులాల వెండిని, ఓభక్తుడు 6 తులాల వెండి గొలుసు, కొల్లూరి సుధీర్ బాబు దంపతులు 5 తులాల వెండి, పోలుపర్తి శ్రీను, కుమారి దంపతులు 5 తులాల వెండిని విరాళంగా ఇచ్చారన్నారు. మేనేజర్ చిటికెన రాంబాబు పాల్గొన్నారు.

రైతును రాజు చేయాలని సీఎం జగన్ కృషి

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- వైఎస్సార్ జలకళ మోటార్ల పంపిణీ



పెదవేగి ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ జలకళ మోటార్లను అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ప్రతి రైతునూ రాజు చేయాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. దివంగత నేత వైఎస్సార్ రైతులకు, వ్యవసాయానికి ఎంత ప్రాధాన్యతనిచ్చారో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సైతం అంతే ప్రాధాన్యతనిస్తున్నారని ఆయన అన్నారు. శుక్రవారం పెదవేగి ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ జలకళ ద్వారా అర్హులైన 16 మంది రైతులకు మోటార్లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ఉచిత బోర్లు వేసి ప్రతి ఎకరాకు, సాగుభూమికి సాగునీరందిస్తున్నామన్నారు. ప్రస్తుతం బోర్‌వెల్ లేని 2.5 ఎకరాలు భూమి ఉన్న రైతులు ఎవరైనా అర్హులన్నారు. పక్కపక్కనే 2.5 ఎకరాలు భూమి ఉన్న రైతులు ఒక్క గ్రూపుగా ఏర్పడి ఉచితంగా బోరును పొందేందుకు ఈ పథకంలో అవకాశం ఉందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. అనంతరం జలకళ పథకంలో బోరు మంజూరైన రైతులను ప్రతి ఒక్కరినీ ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాత రమ్యశ్రీ, మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట బాబు, కార్పొరేషన్ డైరెక్టర్ మెట్లపల్లి సూరిబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ పీ.విజయ్‌బాబు, జిల్లా కమిటీ సభ్యులు గుత్తా ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు తాతా సత్యనారాయణ, మేకా లక్ష్మణరావు, మేడికొండ కృష్ణారావు, గుత్తా ప్రసాద్, సొసైటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎంపీడీఓ రాజ్‌మనోజ్, తహసీల్దార్ నూకరాజు తదితరులున్నారు.

రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన

కొప్పులవారిగూడెంలో సర్పంచ్ చలపాటి మణి అధ్యక్షతన నూతనంగా 20 లీటర్ల ఓహెచ్‌ఎస్‌ఆర్ నిర్మాణానికి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి కావాలని, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో ప్రజలకు సరఫరా చేయాలని సూచించారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కొనికెళ్ళ ప్రసాద్, కొలుసు శ్రీధర్ ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరామర్శించారు. గాలాయగూడెంలో ప్రమాదంలో గాయపడిన గాలాయగూడెం వార్డు మెంబర్, వైఎస్సార్ సీపీ నాయకులు కొండపల్లి శ్రీధర్‌ను దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని శుక్రవారం పరామర్శించారు. వైద్యానికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఆయన వెంట గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, నాయకులు ముసునూరు వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

వినతుల స్వీకరణ

నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యతనిస్తున్నట్టు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ ఆధ్వర్యంలో టోల్‌గేట్ ఉద్యోగులు ఎమ్మెల్యేను కలిశారు. విధి నిర్వహణలో సమస్యలను వివరించి వినతిపత్రాన్ని అందించారు. టోల్‌గేట్ ఉద్యోగుల సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే వెంట బీసీ సెల్ అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



పళ్లెం ప్రసాద్‌కు రూ.3 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: అనారోగ్యంతో బాధపడుతున్న ఏపీ ఫారెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ పళ్లెం ప్రసాద్‌కు శుక్రవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సీఎంఆర్‌ఎఫ్ రూ. 3 లక్షలను చెక్కు అందజేశారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, నాయకులు నిట్టా గంగరాజు ఉన్నారు. అనంతరం ఫారెస్ట్ డైరెక్టర్ పళ్లెం ప్రసాద్ మాట్లాడుతూ తాను కోలుకోవడానికి మొదటి నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, వైఎస్సార్ సీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా రాష్ట్ర విద్యా సాఫల్య పరీక్ష



గుండుగొలను–1 ప్రాథమిక పాఠశాలలో పరీక్ష నిర్వహణ తీరును పరిశీలిస్తున్న జిల్లా జీసీడీవో సబీనా

భీమడోలు: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను గుర్తించేందుకు శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర ఏచీవ్‌మెంట్ (విద్యా సాఫల్య) సర్వే పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా 28 ప్రాథమిక, ప్రాథమికోన్నత, యూపీ, ఉన్నత పాఠశాలల్లోని ఎంపికైన 3,6,9 తరగతులకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు రెండు మాధ్యమాల్లో పరీక్ష నిర్వహించారు. మండల వ్యాప్తంగా 1,132 మంది విద్యార్థులకు 139 మంది గైర్హాజరయ్యారు. 993 మంది పరీక్షలు రాసారు. పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షకు వేంకటేశ్వర డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఫీల్డ్ ఇన్విజిలేటర్లగా వ్యవహరించారు. 3,6,9 తరగతుల్లో ఎంపిక చేసిన విద్యార్థులకు వారికి కేటాయించిన సమయంలో పరీక్షలు నిర్వహించారు. వారంతా ఓఎంఆర్ షీట్లలో ప్రశ్నలకు జవాబులను బంబ్లింగ్ చేసారు. గుండుగొలను–1 ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పాశం పాండురంగారావు పర్యవేక్షణలో నిర్వహిస్తున్న పరీక్షకు 24 మందికి 23 పరీక్ష రాసారు. ఈ పరీక్ష నిర్వహణ తీరును జిల్లా సమగ్రశిక్షాభియన్ జీసీడీవో సబీనా పరిశీలించారు. చిన్నారుల అభ్యసనా స్థాయిని తెలుసుకుని అందులకు తగిన విధంగా విద్యా విధానంలో మరిన్ని మార్పులు తీసుకునేందుకు ఈ పరీక్ష ఎంతోగానో దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి ఇంగ్లీషుపై పట్టు సాధించాలన్న లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అన్నేవారిగూడెం యూపీ పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ ఆధ్వర్యంలో 3, 6వ తరగతుల 28 మంది విద్యార్థులు పరీక్ష రాసారు. ఎంఈవో 2 ఏ.భాస్కర్‌కుమార్ పరీక్ష అమలును పరిశీలించి పలు సూచనలందించారు. అనంతరం ఓఎంఆర్ షీట్లను స్కూలు కాంప్లెక్స్ చైర్మన్ల ద్వారా ఎంఈవో కార్యాలయానికి అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా కార్యాలయానికి సమర్పిస్తామని ఎంఈవో 1 ఈడుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో టీచర్లు సీహెచ్‌ఆర్ జ్యోతిబస్, ఎం.స్వర్ణలత, రవికుమార్, ఆనంద బాబు, దీప్తి పాల్గొన్నారు.

పరీక్షల తనిఖీ

దెందులూరు: దెందులూరు సెయింట్ మెరీస్ యూపీ పాఠశాలతో పాటు అన్ని పాఠశాలల్లో శుక్రవారం నాస్ అచీవ్‌మెంట్ పరీక్షలు నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి ఏవీఎస్‌వీ ప్రసాద్, హెచ్‌ఎం సిస్టర్ టీనా మరియా కలిసి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం పరీక్షలు రాసే విద్యార్థులకు ఎంతఃఓ అవగాహన కల్పించారు.

ఏజెన్సీల మోసపూరిత ప్రకటనలు నమ్మవద్దు



కలపర్రులో సమావేశమైన అమెరికన్ కాన్సులేట్ అధికారి కాథరిన్ గ్లీస్‌మాన్

పెదపాడు: వీసాలు పొందడంలో ఏజెన్సీల మోసపూరిత ప్రకటనలు నమ్మవద్దని అమెరికన్ కాన్సులేట్ అధికారి కాథరిన్ గ్లీస్‌మాన్ రైతులకు సూచించారు. వీసాలు పొందడంలో జరుగుతున్న మోసాలను వివరించేందుకు వచ్చిన కాథరీన్ శుక్రవారం పెదపాడు మండలంలోని కలపర్రులో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాకు వెళ్లేది ఎక్కువ మంది రైతుల పిల్లలేని అందుకే రైతుల స్థితిగతులు తెలుసుకునేందుకు, వీసాలు పొందడంలో జరుగుతున్న మోసాల నివారణ చర్యల్లో భాగంగా వివరించేందుకు వచ్చానని చెప్పారు. ఈ సందర్భంగా రైతులు పండించే పంటలు, సాధించే దిగుబడి, స్థానిక మార్కెట్లు, ఎగుమతి, ఆదాయం వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరి పంటలను, ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు. ఏలూరు జిల్లా జేడీఏ రామకృష్ణ, వ్యవసాయ అధికారి వీ ప్రదీప్‌కుమార్, స్థానిక రైతులు చిన్నం వెంకటేశ్వరరావు, ఎంపీటీ కంభాల నాగరాజు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



భీమడోలులో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ

భీమడోలు: సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలు బాలుర వసతి గృహం వద్ద శుక్రవారం బాలుర, బాలికల వసతి గృహాలు, ఆనంద నిలయంలోని బాలబాలికలకు సాంఘిక సంక్షేమ శాఖ సమకూర్చిన దుప్పట్లు, జింఖానాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ మాట్లాడుతూ చలి వాతావరణంలో విద్యార్థులు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం వారికి దుప్పట్లు, జింఖానాలను అందిస్తోందన్నారు. మూడు వసతి గృహాల్లోని 205 మంది బాలబాలికలకు ఒకొక్కరికి దుప్పటి, జింఖానాను వారికి అందజేసారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు గురుబాబు, ఉమామహేశ్వరీ, కృష్ణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కోదండ రామాలయ ప్రతిష్ఠ పూజలు





భీమడోలులో యాగశాలలో హోమ పూజలు చేస్తున్న పండితులు, కోదండరామునికి పూజలు చేస్తున్న అర్చకులు

భీమడోలు: భీమడోలులోని కోదండ రామాలయం ప్రతిష్ఠ, నూతన విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు మూడో రోజైన శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈనెల 4వ తేదీ శనివారం ఆలయంలోని సీతారామ స్వామి, లక్ష్మణ సమేత హనుమ విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేసారు. ప్రధాన ఘట్టమైన యంత్ర ప్రతిష్ఠలో భాగంగా యంత్ర స్థానంలో రత్నాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థపతి రావిపాటి వెంకట ప్రసాద్ పర్యవేక్షణలో ఆగమ పండితులు, అర్చకుల బృందం సభ్యుల వేదమంత్రోచ్చరణ నడుమ శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. యాగశాలలో హోమ పూజలు, అభిషేకాలు చేసారు. తొలుత కొలువు తీరేందుకు వచ్చిన విగ్రహాలకు జలాధివాసం పూజల్లో భాగంగా జలాభిషేకాలు చేసారు. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

ఉంగుటూరు: దళారులకు ఎటువంటి అవకాశం లేకుండా ధాన్యం కొనుగోలు పారదర్శకంగా చేస్తామని మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ తెలిపారు. ఆర్‌బీకేల వద్ద నాణ్యత ప్రమాణాలు నిర్ధారణ అనంతరం అభ్యంతరాలు వస్తే మిల్లు వద్ద ఉన్న కస్టోడియన్ అధికారి మండలస్థాయి సిబ్బంది సంబంధిత ధాన్యం సేకరణ కేంద్రంలో చర్చించి పరిష్కరిస్తారని ఆయన వివరించారు. రైతు మిల్లుకు వెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. ధాన్యం ఎగుమతి తేదీకి కూపన్లు అందజేస్తామని ఏవో తెలిపారు. ధాన్యం మద్దతు ధరతోపాటు జట్టు కూలీ, గోనె సంచుల రవాణా ఛార్జీలు 21 రోజుల్లో రైతు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ధాన్యం 75 కేజీల కామన్ రకం రూ.1,637, గ్రేడు ఏ రకం రూ.1,652 ధర అందజేస్తామని ఏవో బాలిన వెంకటేష్ తెలిపారు. రైతులకు ఇబ్బంది కలిగితే ఆర్‌బీకేలో లేదా ఉంగుటూరు ఏవో కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చునని ఏవో బాలిన వెంకటేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉంగుటూరు: జాతీయ రహదారిపై బాదంపూడి మత్స్య కేంద్రం సమీపంలో ప్రైవేటు చేపల చెరువుల వద్ద నుంచి ట్రాక్టరు అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడం అదే సమయంలో కైకరం నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళుతున్న మోటారుసైకిల్‌ను ఢీకొంది. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదంలో కైకరం గ్రామానికి చెందిన మోటారుసైకిలిస్టు కత్తుల రమేష్, ఆయన తల్లి గంగమ్మకు తీవ్రగాయాలయ్యాయి. తల్లి చేతిలో ఉన్న ఏడాదిలోపు బాబుకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని తాడేపల్లిగూడెం, ఆ తరువాత ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడికి ఆరోగ్య పరీక్షల కోసం తాడేపల్లిగూడెం తీసుకెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఎస్సై స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాస్కెట్‌బాల్ యూనివర్సిటీ స్థాయి పోటీలకు లోకేష్ ఎంపిక



విద్యార్థి లోకేష్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ జీ.మోజెస్, ప్రిన్సిపల్ స్లీవరాజు, ఫాదర్లు

దెందులూరు: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ త్రిమూర్తుల సమక్షంలో గుంటూరు జిల్లా చినకాకానిలో ఎన్నారై మెడికల్ కళాశాలలో అక్టోబర్ 31న నిర్వహించిన బాస్కెట్ బాల్ పోటీల్లో ఏలూరు జిల్లా సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీకి చెందిన విద్యార్థి టీ.లోకేష్ ఎంపికయ్యారని కరస్పాండెంట్ ఫాదర్ జీ.మోజెస్ అన్నారు. నవంబర్ 13 నుంచి 18 వరకు కేరళలో సౌత్ జోన్ టోర్నమెంట్ యూనివర్సిటీ ఆఫ్ కేరళలోని ఈ టోర్నమెంట్ నిర్వహించనున్నారని ఆ పోటీల్లో లోకేష్ పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ ఎన్. నల్లయ్య వివరించారు. అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫేలిప్స్, ఫాదర్ ధర్మరాజు, పీడీ నల్లయ్య లోకేష్‌ను అభినందించారు.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు



బీఎవ్వోల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సుబ్బారావు

ఏలూరు రూరల్: ఈ నెల 4, 5 తేదీల్లో ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నామని జెడ్పీ సీఈఓ కేఎస్‌ఎస్ సుబ్బారావు చెప్పారు. శుక్రవారం ఏలూరు జెడ్పీ సమావేశ మందిరంలో బీఎల్వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏలూరు నియోజకవర్గంలోని 212 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ బీఎల్వోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంటారన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. ఇదే క్రమంలో ప్రజలు తమ ఓటు గుర్తింపుకార్డులో చేర్పు, మార్పుల కోసం దరకాస్తు బీఎల్వోలకు అందజేయాలన్నారు. రెండురోజుల పాటు నిర్వహించనున్న ఈ శిబిరంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా బీఎల్వోలు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ బి సోమశేఖర్ పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్వోలు విధులను తెలియజేసారు. సమావేశంలో ఏలూరు రూరల్ ఎంపీడీఓ బి ప్రణవి, కమీషనర్ సంక్రాంతి శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



సీతంపేటలో గ్రామస్తులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించడం, ప్రజల సంపూర్ణ ఆరోగ్యం, ఉపాధి, అభివృద్ధి, సంక్షేమం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం సీతంపేటలో సర్పంచ్ పరసా లక్ష్మీ సుజాత కనకరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, సొసైటీ అధ్యక్షుడు నల్లూరి వెంకట్రామయ్య (బాబి), ఎంపీటీసీ పులవర్తి వరమణి, జిల్లా కార్యదర్శి సంతోష్, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ స్తంభానికి లైట్లు, డ్రైనేజీ, ఉపాధి, రోడ్డు, చెరువుల పరిశుభ్రత, పింఛన్, ఇతర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సమస్యల పరిష్కారానికి అధికారులకు, సచివాలయ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఎమ్మెల్యే కొఠారు ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న కాలంలో మరింత అభివృద్ధి, సంక్షేమం రెట్టింపు అవుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు, సర్పంచులు శనపల్లి రామకృష్ణ (విష్ణు), చిలకా వెంకటసుబ్బారావు, మెండేం సంతోష్‌కుమార్, గాలాయగూడెం సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, నాయకులు తొత్తడి కృష్ణ, ఇరుకులపాటి సాంబశివరావు, మొటపర్తి గాంధీ, ముసునూరు వెంకటేశ్వరరావు, సత్తిబాబు, ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వ పెన్షనర్స్‌కు ప్రతి నెలా మొదటి తేదీనే పెన్షన్ ఇవ్వాలని, బకాయిపడిన డీఏ ఆరియర్స్ చెల్లించాలని కోరుతూ ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు శుక్రవారం ఏలూరు సబ్‌ట్రెజరీ ఏటిఓ జి.సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ పిలుపు మేరకు ఏలూరు జిల్లా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు, నగరపాలక సంస్థ విశ్రాంత ఉద్యోగులు కోట దిబ్బ సబ్ ట్రెజరీ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం ఏటిఓకి వినతి పత్రం అందజేసారు. 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్సీకి ఐఆర్‌ను వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు బి.ఆంజనేయులు, కార్యదర్శి కె.మహాలక్ష్ముడు, కోశాధికారి డి.గంగాధర్, ఇజ్రాయేల్ మాస్టర్, ఆర్ వెంకటేశ్వర్లు,ఎస్.మధుసూదనరావు, ఏలూరు నగరపాలక సంస్థ విశ్రాంత ఉద్యోగులు ఏ.అప్పలరాజు, ఎస్‌ఎంవీ సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

భీమడోలు: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 4, 5వ తేదీల్లో శనివారం, ఆదివారాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని భీమడోలు తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ భీమడోలులో ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ఈనెల 4,5వ తేదీల్లోను, వచ్చే నెల 2, 3వ తేదీల్లో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. గత నెల 27న ఎన్నికల సంఘం ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలు బీఎల్‌వోల వద్ద ఉన్నందున ఓటర్ల వాటిని పరిశీలించుకోవాలన్నారు. జాబితాల్లో లోపాలుంటే మార్పులు, చేర్పులు, కొత్తగా ఓటర్లుగా చేరగోరే వారు నిర్దేశించిన దరఖాస్తులను బీఎల్‌వోలకు అందించాలన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు బీఎల్‌వోలు పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు వట్లూరులో గడపగడపకు మన ప్రభుత్వం

పెదపాడు: వట్లూరు సచివాలయం 3 పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో ఎస్ సూర్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని, ప్రభుత్వం నుంచి అందించే సంక్షేమ పథకాలు వివరించి, ప్రజల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్నిశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, హాజరు కావాలని తెలిపారు.